సాక్షి
గుంటూరు

బుధవారం, 5, ఫిబ్రవరి, 2025



అప్పలస్వామి గుడిలో అరుణహోమం


తెనాలి:తెనాలి మారిస్‌పేటలోని కోదండరామ స్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి) లో రథ సప్తమి సందర్భంగా మంగళవారం ప్రత్యేకంగా అరుణ హోమం నిర్వహించారు.



పురపాలక సంఘ ప్రభకు పూజలు

నరసరావుపేట:కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తరలించే పురపాలక సంఘ ప్రభ ఏర్పాట్లకు మున్సిపల్ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. కమిషనర్ పూజలు చేశారు.

దత్త పీఠం వార్షికోత్సవం



ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామంలోని దత్తపీఠం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

హుండీ కానుకలు లెక్కింపు



గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీ ఘంటాలమ్మ, శ్రీ పుట్టలతమ్మ ఆలయ హుండీని మంగళవారం ఆలయ ఈవో డి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.2.57 లక్షలు వచ్చిందని ఈవో తెలిపారు. ఆలయ అర్చకుడు రాంబాబు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సూరిశెట్టి హర్ష, పి. నాగభూషణం, శిరసాని వెంకటరావు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ సాయం

చేబ్రోలు: చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామాభివృద్ధికి అమెరికాలో స్థిరపడిన మద్దినేని శ్రీనివాసరావు చేయూత అందించారు. రూ. పది లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడానికి ముందుకు వచ్చినట్లు సర్పంచ్ బీరం జానకీదేవి మంగళవారం తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం సురక్షితమైన తాగునీరు అందించే ఉద్దేశంతో ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెలలో భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

యార్డుకు 1,17,126 మిర్చి బస్తాలు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,17,126 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,13,256 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,000 నుంచి రూ.15,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.10,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.9,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 77,914 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. దుర్గగుడి ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. కల్యాణోత్సవాన్ని తిలకించి తరించేందుకు పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం తలంబ్రాలను భక్తులకు అర్చకులు పంపిణీ చేశారు.

ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన

మాఘ మాసం, రథ సప్తమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సూర్యోపాసన సేవ జరిగింది. రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు సూర్య భగవానుడి చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని కోరుతూ సూర్యభగవానుడికి పూజలు చేశామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 550.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,833 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఇసుకంతైనా లెక్కే లేదు!

అడ్డగోలుగా ఇసుక తవ్వేస్తూ కృష్ణమ్మ నుంచి అక్రమార్కులు కాసులు కొల్లగొడుతున్నారు. 'సాక్షి' కథనంతో ఇటీవల కదిలిన జిల్లా స్థాయి అధికారి తనిఖీ చేశారు. మరోమారు ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కానీ, ఆ తర్వాతే అక్రమార్కులు బరితెగించారు. అప్పటివరకు గుట్టుగా రాత్రివేళ తరలించిన వారు.. ఇప్పుడు పట్టపగలే తవ్వకాలు కొనసాగిస్తున్నారు.

- కృష్ణానదిని తోడేస్తున్న ఇసుకాసురులు
- యథేచ్ఛగా భారీ యంత్రాల వినియోగం
- గతంలో రాత్రి వేళ గుట్టుగా కార్యకలాపాలు
- అధికారి హెచ్చరించాక పట్టపగలే బరితెగింపు
- సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా బేఖాతర్



కొల్లిపర వద్ద బొమ్మువానిపాలెం రీచ్‌లో ఇసుకను తోడుతున్న జేసీబీలు

తెనాలి: ఇసుక రీచ్‌లలో నిబంధనల ప్రకారం తవ్వకాలు చేయాలని, వ్యతిరేకంగా జరుగుతున్నట్టుగా పత్రికా కథనాలు, ఫిర్యాదులొచ్చినా రీచ్‌లు నిలుపుదల చేస్తామని ఇటీవల తెనాలి ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ హెచ్చరించారు. రాత్రి సమయాల్లో నదిలో యంత్రాలతో ఇసుకను తవ్వేస్తూ భారీ వాహనాలతో తరలిస్తున్నారనే 'సాక్షి' కథనంతో ఆయన కొల్లిపర మండలంలోని రీచ్‌లను తనిఖీ చేశారు. అప్పుడే రీచ్‌ల నిర్వాహకులను తగిన ఆదేశాలను జారీ చేశారు. ఆయన ఆదేశాలనే కాదు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను బొమ్మువానిపాలెం రీచ్ నిర్వాహకులు బేఖాతరు చేశారు. రాత్రి పూటేం కర్మ... పట్టపగలే ఇసుకను తోడేస్తున్నారు.

మచ్చుకైనా పాటిస్తే ఒట్టు

కొల్లిపర మండలంలో ప్రభుత్వం అనుమతించిన ఇసుక రీచ్‌లు మూడు నడుస్తున్నాయి. మున్నంగిలో ఒకటి, బొమ్మువానిపాలెం పరిధిలో రెండు ఉన్నాయి. వీటిలో కొల్లిపర గ్రామానికి ఎదురుగా ఉన్న బొమ్మువానిపాలెం రీచ్‌లో తవ్వకాలకు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. వాస్తవంగా నదిలో ఇసుకను కూలీలతోనే తవ్వించాలి. అది కూడా ట్రాక్టర్లలో నింపుకొని, నది బయట ఏదైనా ప్రదేశంలో ఏర్పాటు చేసుకున్న స్టాక్ పాయింట్‌కు తరలించుకోవాలి. అక్కడ్నుంచి భారీ టిప్పర్లు/లారీల్లో రవాణా చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను రీచ్‌లో బేఖాతర్ చేశారు.

భారీ యంత్రాలు, వాహనాలు...

తాజాగా మూడు నుంచి నాలుగు యంత్రాలతో ఇసుకను తోడుతున్నారు. బారులు తీరిన 30-40 టన్నుల భారీ టిప్పర్లు సహా లారీలకు నింపుతున్నారు. నేరుగా రవాణా చేసేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది చూసీచూడనట్టు వెళ్లిపోతున్నారంటే రీచ్ నిర్వాహకులు పలుకుబడి, తెగింపును అర్థం చేసుకోవచ్చు. ఇసుక రీచ్‌లపై ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన గడువు ఈ నెల 6వ తేదీతో ముగియనుంది. అందుకోసమే ఆలోగా వీలైనంత దండుకోవాలనే ఆరాటంతో రీచ్ నిర్వాహకులు తెగించారని చెబుతున్నారు. నిఘా వ్యవస్థ ఎటుపోయిందో... ఉన్నతాధికారులు ఆర్భాటంగా ప్రకటించిన జిల్లా ఇసుక కమిటీ ఏమైందో ఎవరికీ తెలియదు. కృష్ణానది మాత్రం బొమ్మువానిపాలెం పరిధిలో గుల్లవుతోంది.

ఆగని అక్రమార్కులు



నదిలోనే లోడింగుకు వేచి ఉన్న భారీ వాహనాలు

కొద్దిరోజుల క్రితం వరకు రాత్రివేళ రహస్యంగా యంత్రాలతో తవ్వకాలు చేస్తూ భారీ టిప్పర్లతో స్టాక్‌పాయింట్‌కు తరలిస్తూ వచ్చారు. దీనిపై 'సాక్షి'లో వచ్చిన కథనంతో అప్పటి తెనాలి ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తనిఖీ చేశారు. నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. మరోసారి ఎలాంటి ఫిర్యాదులొచ్చినా రీచ్‌ను ఆపేస్తామని హెచ్చరించారు. అధికారులు నిఘా ఉంచాలని ఆదేశించారు కూడా! అయినా సరే, బొమ్మువానిపాలెం రీచ్‌లో అక్రమ తవ్వకాలు ఆగటం లేదు. తవ్వకాలు అర్ధరాత్రికి మారాయి. మళ్లీ వారం రోజులుగా పట్టపగలే పని కానిచ్చేస్తున్నారు.

గుంటూరు మిర్చి యార్డులో

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి

- విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోం
- అధికారులతో మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శ్రీనివాసరావు

కొరిటిపాడు (గుంటూరు వెస్ట్): గుంటూరు మార్కెట్ (మిర్చి)యార్డులో సీజన్ ప్రారంభమైందని, రోజుకు లక్షకు పైగా బస్తాలు వస్తున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) కాకుమాను శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో యార్డు అధికారులు, సిబ్బంది, అందుబాటులో ఉన్న మిర్చి ఎగుమతి వ్యాపారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ముందుగా ఉచిత భోజనం, అల్పాహారశాల, రైతు విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌జేడీ మాట్లాడుతూ.. ఎగుమతి వ్యాపారులు ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చిని ఆ రోజే బయటకు తరలించేలా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా సూచనలు చేశారు. ఉచిత భోజనం, అల్పాహారం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని పేర్కొన్నారు. ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాటాలు వేమెన్స్ మాత్రమే వేయాలన్నారు. యార్డులో శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని చెప్పారు. రైతు విశ్రాంతి భవనంలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని పేర్కొన్నారు. వాటర్, బెడ్లు కొరత లేకుండా చూడాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించబోమని స్పష్టం చేశారు. సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా మరో 40 మంది సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నియమించామని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకులు ఝాన్సీ, ఏడీఎం బి.రాజబాబు, యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం, శ్రీకాంత్, వ్యాపారులు కె.సుధాకర్, నరేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్ తేజ

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నిర్వహణపై ఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉప సంహరణ సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలను తగిన జాగ్రత్తలు తీసుకొని పటిష్టంగా చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సహాయక రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి ఉత్సవాలు



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి నగర పరిధిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రథసప్తమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు సప్త వాహనాలపై గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై తొలుత దర్శనమిచ్చారు. అనంతరం శేష, గరుడ, హనుమంతుని వాహనాలపై భక్తులను కటాక్షించారు. భక్తులు పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామి వారు కల్ప వృక్ష వాహనం, రాజాధిరాజ వాహనం, చంద్ర ప్రభ వాహనాలపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా వాహనాల కైంకర్యపరులు ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో అన్నపురెడ్డి రామకోటి రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు పూజలు చేశారు.

కనువిందుగా భావనారుషి వసంతోత్సవం



తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీ భద్రావతిసమేత శ్రీభావనారుషి స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందురోజున స్వామి వార్ల కళ్యాణోత్సవం జరిగిన విషయం తెలిసిందే. తర్వాత వసంతోత్సవం, రాత్రికి సహస్ర దివిటీల ఉత్సవం, స్వామివారిని కీలుగుర్రం వాహనంపై ఊరేగింపు జరిపారు.

ఘోరాతి కోరం!

పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా



మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో సభ్యులు లేక ఖాళీగా ఉన్న కౌన్సిల్ హాల్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక రెండవరోజు సైతం వాయిదా పడింది. మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 32 మంది ఉండటంతో సాధారణంగా వైఎస్సార్ సీపీనే వైస్ చైర్మన్ ఎన్నిక గెలవాల్సి ఉండగా అధికార పార్టీ ఆదేశాలతో ఒక పక్క పోలీసులు, మరో పక్క టీడీపీ గూండాలు కుమ్మక్కై మళ్లీ వాయిదా పడేలా చేశారు.

ఎక్కడికక్కడ ఆటంకాలు..

తెలుగుదేశం పార్టీ గూండాలతో కుమ్మక్కైన పోలీసులు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను మున్సిపల్ కార్యాలయం వరకు రాకుండా ఎక్కడిక్కడికి అడ్డుకున్నారు. సాధారణంగా 10 గంటల లోపు ఫాం ఏ, ఫాం బీలు మున్సిపల్ కార్యాలయంలో అందించాల్సి ఉంది. అయితే వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఎవరిని మున్సిపల్ కార్యాలయం వద్దకు రానివ్వకుండా కట్టడి చేయటంతో ఆ ఫారాలను సకాలంలో అందించలేకపోయారు. 32 మంది గాను కేవలం ఐదుగురు మాత్రమే మాజరయ్యారు. సుమారు ఒక 10 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను పట్టణ పోలీసులు తమపై కేసులు ఉన్నాయని చెప్పి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన కౌన్సిలర్లను వారి ఇళ్లలో నుంచి బయటకురానివ్వకుండా ఇళ్ల ముందు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గూండాల్లాగా నిలబడి కాపాలాగా నిల్చొన్న పరిస్థితి. దీంతో సమయానికి పత్రాలు అందించకపోవటంతో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక రెండవ రోజు మంగళవారం సైతం వాయిదా పడింది.

ఉదయాన్నే భారీ సంఖ్యలో..

ఉదయాన్నే పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఒక పక్క టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మున్సిపల్ కార్యాలయం అంతా కిక్కిరిసిపోయింది. అయితే మున్సిపల్ కార్యాలయం వద్దకు మాత్రం కేవలం ఐదుగురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. 18వ వార్డు కౌన్సిలర్ జ్యోగిపర్తి సుజాత, 20 వార్డు కొత్త తులసీ, 21వ వార్డు కొత్త పుష్పలత, 28వ వార్డు గర్నె నాగేశ్వరరావు, 30 వ వార్డు ఉన్నం భారతిలు మాత్రమే హాజరయ్యారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1,818 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 76 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 203 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 141 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 122 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 45 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 680 క్యూసెక్కులు వదిలారు.

పేదల పెద్దాసుపత్రిగా పేరు గడించిన గుంటూరు జీజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే రోగులను కొందరు సిబ్బంది రాబందుల్లా పీక్కుతింటున్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో పుట్టినా, గిట్టినా వారికి మామూళ్లు ఇవ్వకపోతే చుక్కలు చూపుతున్నారు. పుట్టిన బిడ్డను తల్లి ఒడికి చేర్చడం లేదు.. ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడం లేదు. తమ కాసుల కక్కుర్తితో ఈ వికృత పనులు చేస్తున్నారు.



పుట్టినా.. గిట్టినా.. ముట్టజెప్పాల్సిందే!

రోగుల కుటుంబాలను పీక్కుతింటున్న గుంటూరు జీజీహెచ్ వార్డు సిబ్బంది

- డబ్బు వసూలు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ప్రసవాలు జరిగినా, ప్రాణాలు పోయినా కాసులకు కక్కుర్తి
- మృతదేహాలను తరలించడానికీ డబ్బులు డిమాండ్
- అంబులెన్సుల వారి దందాకు అన్ని విధాలా సహకారం
- గుంటూరు జీజీహెచ్‌లో సామాన్యులకు తీవ్ర కష్టాలు
- కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలోని దృశ్యం

గుంటూరు మెడికల్: మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో ఒకరు చనిపోగా.. సంబంధిత కుటుంబసభ్యుల నుంచి అక్కడ పనిచేస్తున్న వార్డు బోయ్ డబ్బులు తీసుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఆసుపత్రిలోని కాన్పుల వార్డులో ఆడ, మగ శిశువులను బట్టి వసూళ్లు ఫిక్స్ చేశారు. ఆ మొత్తాన్ని వార్డులో పనిచేస్తున్న వారికి ఇస్తే తప్ప పుట్టిన బిడ్డను తల్లికి చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రోజూ 20కుపైగా డెలివరీలు జరుగుతున్నాయి. వైద్యులు, సిబ్బంది ఎంతో కష్టపడి చికిత్స అందించి తల్లీబిడ్డలకు ఊపిరి పోస్తున్నారు. గర్భిణులను వార్డు, ఆపరేషన్ థియేటర్ మధ్య తీసుకొచ్చి తీసుకెళ్లినందుకు కింది స్థాయి ఉద్యోగులు తామే ఆపరేషన్లు చేసినంత బిల్డప్ ఇస్తున్నారు. పుట్టిన బిడ్డలను వెంటనే తల్లి పొత్తిళ్లకు చేర్చకుండా మామూళ్లు అడుగుతూ కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చచ్చినా చావే...

చికిత్స పొందుతూ ఎవరైనా చనిపోతే చాలు మృతదేహాలను వార్డు నుంచి అంబులెన్సు వరకు తరలించడానికి కూడా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోజూ ఐదు నుంచి పది మంది వివిధ కారణాలతో ఇక్కడ చనిపోతున్నారు. పోస్టుమార్టం చేయాల్సి వస్తే మార్చురీ విభాగాల్లో రూ. 5 వేల నుంచి రూ.10 వేల వరకు పోలీసుల పేరుతో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్చురీకి మృతదేహాన్ని తరలించినా ఇదే తంతు కొనసాగుతోంది. నార్మల్ డెత్ కేసులో మృతదేహాన్ని అంబులెన్సు వద్దకు తీసుకెళుతూ ఓ ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేస్తూ పట్టుబడిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది.

అంబులెన్సు విషయంలోనూ..

పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తరలించేందుకు ప్రభుత్వం మహాప్రస్థానం పేరుతో ఉచిత అంబులెన్సులు ఏర్పాటు చేసింది. అవి పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. రాత్రి సమయాల్లో అసలే ఉండవు. దీంతో అంబులెన్సులను కొంత మంది ఆసుపత్రి ఉద్యోగులే సొంతంగా కొని నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు అంబులెన్సుల వారు యూనియన్‌గా ఏర్పడి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నట్లు పలుమార్లు ఫిర్యాదులు సైతం వచ్చాయి. వీరు ఆసుపత్రి సిబ్బందితో ఒప్పందాలు చేసుకుని మరీ మృతదేహాలను తమ వాహనంలో పంపించేందుకు కొంత వారికి ముట్టజెబుతున్నట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ ఫీజు నిర్ణయించినా ఆ మేరకు అమలు మాత్రం కావడం లేదు. అధికారులు ఇకనైనా స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం



ఆసుపత్రిలో అవినీతికి పాల్పడుతున్నట్లు సిబ్బందిపై ఫిర్యాదు వస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. అంబులెన్సులో మృతదేహాలు తరలించేందుకు డబ్బులు తీసుకుంటున్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ చేయించి, బాధ్యులను సస్పెండ్ చేస్తాం.

– డాక్టర్ యశస్వి రమణ, సూపరింటెండెంట్, గుంటూరు జీజీహెచ్

రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

- ప్రభుత్వం సిబ్బంది, నిధులు కేటాయించాలి
- రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు
- సంఘం సమావేశంలో పలు కీలక తీర్మానాలు

లక్ష్మీపురం: రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడిని తగ్గించాలని, పని భారం ఆధారంగా ప్రతి మండలం, డివిజన్, కలెక్టర్ కార్యాలయాల్లో సిబ్బందిని పెంచాలని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ భవన్‌లో మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయాల్లో కనీస వసతులు కూడా లేక ప్రధానంగా ఉద్యోగినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించనందున, పని ఒత్తిడితోపాటు ఆర్థిక ఒత్తిడి కూడా పెరిగిందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న రెవెన్యూ కార్యాలయాల స్థానంలో కొత్తవి నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అయిదు సంవత్సరాల క్రితం నిర్మించిన తహసీల్దార్ , ఆర్డీఓ కార్యాలయాలను కాంట్రాక్టర్ల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. సిబ్బందికి చట్టాలపై అవగాహన అవసరమని, శిక్షణ తరగతుల బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్ మాట్లాడుతూ.. ఇటీవల కోర్టు ధిక్కరణ కేసులలో కౌంటర్లు వెయ్యడానికి ఉద్యోగులు రూ.లక్షలు తమ జీతాల నుంచి చెల్లిస్తున్నారని తెలిపారు. తహసీల్దారు, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులకు కేటాయించిన అద్దె వాహనాలకు బిల్లులు చెల్లించడానికి నిధులు లేక సొంతంగా ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి జిల్లాకు ప్రోటోకాల్ నిమిత్తం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ వెంకటరావు, నాయకులు అనుపమ, అయూ, విజయ దుర్గ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్

ఏడుగురిపై కేసు నమోదు

చినగంజాం: మున్నంవారిపాలెం పరిధిలో వైఎస్సార్ సీపీ అనుయాయులపై టీడీపీ వర్గీయుల దాడికి సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పెర్నేటి పేరి లింగేశ్వరరావు తెలిపారు. నిందితుల్లో మున్నం వారిపాలేనికి చెందిన కోకి పవన్ కుమార్, కోకి రామిరెడ్డి, కోకి లక్ష్మారెడ్డి, రాజుబంగారు పాలేనికి చెందిన కోకి భాస్కరెడ్డి, కోకి శివరామిరెడ్డి, కోటిరెడ్డి, పలపట్ల అభి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర


కనిష్ఠం : రూ. 3,800 గరిష్ఠం : రూ. 4,600

మోడల్ ధర రూ. 4,200

రైల్వే సిబ్బందికి పలు పోటీలు

ఘనంగా బ్రోచర్ ఆవిష్కరణ

లక్ష్మీపురం: భారతీయ రైల్వే వంద సంవత్సరాల ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌ను పూర్తి చేసుకుందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో భారతీయ రైల్వేలు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. సీనియర్ డీఈఈ పి.రవితేజ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారన్నారు. ప్రధానంగా నల్లపాడు కేంద్రీయ విద్యాలయంలోని క్విజ్, వ్యాసరచన పోటీలు జరిగాయని చెప్పారు. సాంకేతిక సెమినార్ బ్రోచర్, ప్రదర్శన, విద్యుత్ ట్రాక్షన్ చరిత్ర, వాకథాన్ ఉత్సాహంగా కొనసాగినట్లు పేర్కొన్నారు. అనంతరం బ్రోచర్‌ను డీఆర్‌ఎం ఆవిష్కరించారు. డివిజన్ విద్యుదీకరణ విభాగాధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం ఎం. రామకృష్ణ, సీనియర్ డీఈఈ పి.రవితేజ

ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు

గుంటూరు ఎడ్యుకేషన్: చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే సత్ఫలితాలు వస్తాయని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్‌లో మంగళవారం మిడిల్, సెకండరీ క్యాంపస్‌ల 50వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యను ఒక మూస పద్ధతిలో కాకుండా తల్లిదండ్రులు, పిల్లల అభిరుచికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మనం దేశాన్ని, పెద్దలను, గురువులను, తల్లిదండ్రులను తప్పక గౌరవించాలన్నారు. జై జవాన్, జై కిసాన్ అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పాఠశాల సీఏవో దుర్గా రఘురామ్ మాట్లాడుతూ.. శాంతి, ఆరోగ్యం, సహాయ సహకారాలకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మొబైల్ ఫోన్‌ను అత్యవసరాలకే పరిమితం చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పొలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపల్ సుధామాధవి, వైస్ ప్రిన్సిపల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

విజ్ఞాన్ విద్యార్థినికి బంగారు పతకం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థిని తైక్వాండోలో జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తమ యూనివర్సిటీలో రెండో సంవత్సరం సీఎస్‌ఈ చదువుతున్న ఆర్.కళా జ్యోత్స్న ఇటీవల తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ఈ పతకం సాధించిందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తరపున అండర్ – 67 కేజీల సీనియర్ ఉమెన్ కేటగిరీలో పతకం కైవసం చేసుకుందని తెలిపారు. విద్యార్థినిని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు అభినందించారు.


విద్యార్థిని ఆర్.కళా జోత్స్నను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోండి


తెనాలి: ఇప్పటికీ ఈ–క్రాప్ నమోదు చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలని చెప్పారు. రూరల్ మండల గ్రామం హాఫ్‌పేటలోని పెసర పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. పెసర పంటలో వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట రుణాలు తీసుకోని కౌలు రైతులు ఎవరైనా ఉంటే వెంటనే రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అయిదుగురు రైతులు జేఎల్‌జీ గ్రూపుగా రుణాలను పొందవచ్చని సూచించారు. రబీ పంటలకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా చూశామన్నారు. తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.ఉషారాణి, వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్, టెక్నికల్ వ్యవసాయాధికారి శ్రీరమణ, వంశీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.


పెసర చేనులో పరిశీలించి సూచనలిస్తున్న వెంకటేశ్వర్లు

బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్ మహిమ ప్రవేశం

వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కాకాని స్వస్థిశాలలో ప్రత్యేక ప్రార్థనలు


పెదకాకాని: బైబిల్ మిషన్ స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థన నిర్వాహకులు డాక్టర్ జె.ప్రమీలా సెల్వరాజ్ సోమవారం గుంటూరులో ప్రభువు సన్నిధిని చేరారు. రాత్రి ఆమె భౌతికకాయాన్ని పెదకాకాని స్వస్థిశాలకు తీసుకొచ్చి మంగళవారం ఉదయం వరకు నిర్విరామంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగళవారం భూస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రమీలమ్మ మహిమ ప్రవేశ వార్త విన్న భక్తులు వేలాదిగా తరలివచ్చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ అధ్యక్షుడు, పెదకాకాని స్వస్థిశాల నిర్వాహకులు రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. ప్రమీలమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ అబ్రహం, బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ రెవరెండ్ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి.సుధాకర్, రెవరెండ్ జె.ఆగమన రావు, రెవరెండ్ ఎం.రవి, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.


ప్రమీలా సెల్వరాజ్ (ఫైల్)

శ్రీశ్రీ మహాప్రస్థానం మహా ప్రభంజనం

అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్ల: శ్రీ శ్రీ మహాప్రస్థానం తెలుగు సాహిత్య రంగాన్ని కుదిపేసిందని జిల్లా అదనపు ఎస్పీ టి.పి. విఠలేశ్వర్ పేర్కొన్నారు. మహాప్రస్థానం 75 వసంతాల సందర్భంగా శ్రీ శ్రీ సాహిత్య నిధి వారు ప్రచురించిన 'జ్వాలాతోరణం' పుస్తకాన్ని మంగళవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అధ్యక్షత వహించారు. జిల్లా అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పుస్తకావిష్కరణ చేశారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ తెలుగువారిని కదిలించివేసి, అందులోని అక్షరాలే కత్తులుగా, ఈటెలుగా మారి, బడబాగ్నిని రగిలించాయని, పేదవాళ్ల కన్నీళ్లు తుడుస్తాయని చెప్పారు. ఎందరికో స్వాంతన కలిగిస్తాయని అన్నారు. అది భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుందని తెలిపారు. విజయవాడ శ్రీ శ్రీ సాహిత్య అధినేత, కవి సింగంపల్లి అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో శ్రీ శ్రీ జాతీయ పురస్కార గ్రహీత అడుసుమిల్లి మల్లికార్జునను అదనపు ఎస్పీ సత్కరించారు. కార్యక్రమంలో చిత్రకారుడు జీవి, ఉపాధ్యాయులు ఎస్ రామకృష్ణ, అధ్యాపకులు అబ్దుల్ కలాం, గురజాల శ్రీనివాసరావు, ఇక్కుర్తి శ్రీనివాస్, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, మానవత కార్యదర్శి ఎం.ప్రసన్నాంజనేయులు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.


జ్వాలాతోరణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

వికీపీడియాతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

వికీపీడియా ప్రాజెక్ట్ టీం ప్రోగ్రాం మేనేజర్ కృపాల్ కాశ్యప్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో డిగ్రీ విద్యార్థులు వికీపీడియాపై అవగాహన పెంచుకోగలిగితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు హెచ్చుగా ఉంటాయని హైదరాబాద్‌కు చెందిన వికీపీడియా ప్రాజెక్ట్ టీం ప్రోగ్రాం మేనేజర్ కృపాల్ కాశ్యప్ పేర్కొన్నారు. మంగళవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో తెలుగు విభాగ ఆధ్వర్యంలో వికీపీడియాపై తెలుగులో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృపాల్ కాశ్యప్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 350 భాషల ద్వారా సమస్త విజ్ఞానం గురించి తెలుసుకునే అవకాశం వికీపీడియా వల్ల కలిగిందన్నారు. ఎన్‌సైక్లోపీడియా అని పిలవబడే వికీపీడియా నిలదొక్కుకోవడానికి గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు సహకరిస్తున్నాయని చెప్పారు. టీఈ.వికీపీడియా.ఓఆర్‌జీ లింకు ద్వారా తెలుగు వికీపీడియాలోనికి ప్రవేశించి భాషా సంస్కృతులు, భౌగోళిక స్వరూపాల గురించి అధ్యయనం చేయవచ్చునని వివరించారు. తెలుగు వికీపీడియా రచయిత యర్రా రామారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ వికీపీడియా అంశంతో తమ కళాశాలలో డిగ్రీ తరగతులు ఉన్నాయని చెప్పారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థినులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ వాసిరెడ్డి భవాని, డాక్టర్ దివిజా దేవి, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డాక్టర్ డి.ధాత్రి కుమారి పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామారావు

అసంఘటిత కార్మికుల వివరాలు నమోదు చేయాలి

నరసరావుపేట రూరల్: అసంఘటిత రంగ కార్మికుల వివరాలను ఈ శ్రమ పోర్టల్‌ను నమోదు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంచాలకులు బాలునాయక్ తెలిపారు. కోటప్పకొండ సంస్థ జిల్లా కార్యాలయంలో మంగళవారం కార్మికశాఖ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశ్యంతో ఈ–శ్రమ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇప్పటికే సర్వే ద్వారా జిల్లాలోని కార్మికులను గుర్తించినట్లు తెలిపారు. 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని తోపుడు బండ్లు, వలస కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి ధనలక్ష్మి, ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

పీఠాధిపతి బాధ్యతల స్వీకరణకు తరలిరండి

తెనాలి: శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి జన్మస్థలమైన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని అఖిల భారత శ్రీవాసవి పెనుగొండ క్షేత్రానికి పీఠాధిపతిగా తెనాలి వాసి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) బాధ్యతలు స్వీకరించనున్నట్లు శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 6, 7, 8వ తేదీల్లో జరగబోయే ఈ మహోత్సవానికి తెనాలి, పరిసరాల్లోని భక్తులు తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు నంబూరు వెంకట కృష్ణమూర్తి, కోశాధికారి గోపు రామకృష్ణ, ముద్దాభక్తుని రమణయ్య, రఘునాథ్ గుప్తా, పెనుగొండ వెంకటేశ్వరరావు, పోలిశెట్టి సురేష్, అద్దంకి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు

అచ్చంపేట: విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా కొట్టగా నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని తాడువాయి – కొత్తపల్లి గ్రామాలమధ్య మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాడువాయి నుంచి తాళ్ల చెరువులోని ఓ పాఠశాలకు నిత్యం ఎనిమిది మంది విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. రోజులాగే ఆటోలో మంగళవారం ఉదయం తాడువాయిలో ఎనిమిది మందిని ఎక్కించుకుని తాళ్లచెరువు వస్తుండగా గ్రామానికి సమీపంలో పంటపొలాలవద్దగల మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టింది. ఆటో రెండు పొర్లుగింతలు వేసి పంట పొలాలలో పడింది. అందులో ప్రయాణిస్తున్న మూడో తరగతి విద్యార్థిని అనన్య ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. గౌతమ్, దీపిక, అక్కి, మిల్కి, హనీ, దీవెనలకు స్వల్ప గాయాలయ్యాయి. మలుపులో ఎదురుగా వస్తున్న వాహన కనిపించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.


సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న అనన్య

తాళం వేసిన బైకు కనిపిస్తే మాయం


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో చోరీలు చేసిన జంట
- నిఘా పెట్టి అరెస్టు చేసిన మంగళగిరి పోలీసులు
- రూ.16.95 లక్షల విలువైన బైక్‌లు స్వాధీనం

మంగళగిరి (తాడేపల్లి రూరల్): సహజీవనం చేస్తున్న ఓ జంట జల్సాలకు అలవాటై బైకు చోరీల బాట పట్టింది. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలైంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తాళం వేసిన ద్విచక్ర వాహనాల చోరీ కేసులు ఎక్కువ కావడంతో మంగళగిరి పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి నిందితులను అరెస్టు చేశారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, పట్టణ సీఐ వినోద్‌కుమార్‌లతో కలసి ఆయన కేసు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... గుంటూరుకు చెందిన సతీష్, గౌసియా తమ జీవిత భాగస్వాములను వదిలేసి సహజీవనం చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన వినోద్ కూడా వీరికి తోడయ్యాడు. తాళం వేసిన బైకు చోరీ చేయాలంటే రాత్రి సమయంలో ముందుగా వినోద్ అక్కడకు వెళ్లేవాడు. తర్వాత ఈ జంట వచ్చి మారు తాళాలతో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసేది. ఆ సమయంలో ఎవరైనా వస్తే గౌసియా, సతీష్‌లు మాట్లాడుకుంటున్నట్లు నటించేవారు. వాహనాన్ని విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. మంగళగిరి పట్టణ పరిధిలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ వినోద్ కుమార్ స్థానిక సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు సిబ్బందిని పెట్టారు. మంగళగిరి పట్టణంలో ద్విచక్రవాహనాన్ని చోరీ చేస్తుండగా వీరిని గమనించారు. పోలీసులు వెళ్లేసరికి పారిపోయారు. కాజ టోల్‌గేటు వద్ద ప్రత్యేక బృందాల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.16.95 లక్షల విలువైన 17 వాహనాలు రికవరీ చేశారు.

గొర్రెల మండిపై కుక్కల దాడి

15 గొర్రెలు మృత్యువాత

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలంలోని దాట్లవారిపాలెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గొర్రెల మండిపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 15 గొర్రెలు మృత్యువాత పడగా 10 గొర్రెలకు గాయాలయ్యాయి. రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు మోరబోయిన వీరయ్య తెలిపారు. తన తండ్రి అప్పు చేసి 30 జీవాల పిల్లలను కొనుగోలు చేసి పెంచుకుంటున్నారని, ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు.



గుండ్లకమ్మలో మహిళ మృతదేహం లభ్యం

నూజెండ్ల(శావల్యాపురం): గేదెలు తోలుకుంటూ గుండ్లకమ్మ వాగులో దిగి ప్రమాదవశాత్తు మహిళ గల్లంతైన ఘటనలో మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ ఎంవీ కృష్ణారావు తెలిపారు. నూజెండ్ల మండలం పాత నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బిజినేపల్లి మరియమ్మ (45) గేదెలు తోలుకొంటూ వెళ్లి సమీపంలోని గుండ్లకమ్మ వాగులో పడి మృతిచెందింది. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.